జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

22 ఆదివారం నవంబర్ 2026 | నవంబర్ | 2026 • పేజీలు : 8

జీతం మణుగూరులో.. మకాం భద్రాచలంలో..!

ప్రభుత్వ ఆసుపత్రికి సూపరింటెండెంట్ లేరు.. ఫైవేటుకే టైం..?

గంట ప్రయాణం చేసి వస్తే.. అత్యవసర రోగి బతుకుతాడా..?

పేద రోగుల ప్రాణాలతో చెలగాటమా..! సూపరింటెండెంట్ ఎక్కడ..?

హెడ్ క్వార్టర్స్ వదిలి వెళ్తే.. ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారు...



02

గిన్నెల బేతాలుడి మాయాజాలం

ఏసీబీ వలలో పడి జైలుకు వెళ్లిన గత సీఐ..!

03

- గిన్నెల బేతాలుడి తెర వెనుక ఏం జరిగింది..?
- గిన్నెల బేతం స్కెచ్.. సర్వేలో 50 డూప్లికేట్ పేర్లు..!
- కేసు తప్పించుకోవడానికి లంచం ఎర.. ఏసీబీకి దొరికి జైలుకు వెళ్లిన అధికారి..!
- వేల ఎకరాలు ఎలా వచ్చాయి..? తహసీల్దార్ లేఖ ఏమైంది..?
- బేతాలుడిని కాపాడుతున్న ఓ పత్రిక యాజమాన్యం...



“ గిన్నెల వ్యాపారం ముసుగులో సాగుతున్న భారీ బాగోతంపై స్థానికుల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. కేంద్ర బిందువుగా ఉన్న గిన్నెల బేతాలుడి వ్యవహారంపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో భూ వ్యవహారంలో అప్పటి తహసీల్దార్ సూచనతో కేసు నమోదు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని, ఆ కేసు నుంచి తప్పించుకోవడానికి అప్పటి సీఐకి నగదు ఆశ చూపారన్న విమర్శలు ఇప్పుడు సంచలనం రేపుతున్నాయి. ఆ వ్యవహారమే చివరకు ఏసీబీ వలగా మారి, సీఐ అడ్డంగా దొరికి జైలుకు వెళ్లేలా చేసిందని స్థానికుల్లో చర్చ నీయాంశంగా మారింది. అంతేకాకుండా సింగరేణి ఓసీ విస్తరణ సర్వేలో సుమారు 50 మంది అనర్హుల పేర్లు చేర్పించి కోట్లాది రూపాయల పరిహారాన్ని కొల్లగొట్టేందుకు ప్రయత్నం జరుగు తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వేల ఎకరాల భూములు ఇతని చేతిలోనే ఉన్నాయన్న అనుమానాలు అందరినీ ఆలోచింప జేస్తున్నాయి. ”



ప్రజాజ్యోతి కథనానికి స్పందన...

02

-మణుగూరులో మొదలైన రోడ్డు పనులు..!

-కాలుష్య కోరల్లో మణుగూరు అంటూ రాసిన కథనానికి ఫలితం...

-గుంతలు పూడ్చి.. దుమ్ము తగ్గించేలా రోడ్డు నిర్మాణం చేపట్టిన అధికారులు...

-ఎమ్మెల్యే చొరవతో కదిలిన యంత్రాంగం.. ప్రజల్లో హర్షం...

చివరి తడి కోసం సీతారామ జలాలు విడుదల

రైతుల అభ్యర్థనకు స్పందించిన మంత్రి “తుమ్మల”

వైరా--ఏన్కూరు, అన్నపురెడ్డిపల్లి, రామచంద్రపురం మేజర్ కాలువలకు గోదావరి జలాలు



02



జపాన్‌లో ముగిసిన జిల్లా కలెక్టర్ అంకిత్ జైకా అధ్యయన పర్యటన

విద్య, ఆరోగ్యం, పోషణ రంగాల్లో సేవల మెరుగుదలకు అధ్యయన అంశాల వినియోగం

ప్రజల ప్రాణాలంటే అంత అలుసా?

-ఇష్టానుసారంగా మేకల వధ.. -ప్రజారోగ్యంతో చెలగాటం!-

కమేళాలో నిబంధనలు గాలికి..

-అనారోగ్య మేకలను వధిస్తున్నారనే ఆరోపణలు -మృతి చెందిన మేకలను సైతం కోస్తున్నారా?

-రెండేళ్ల క్రితమే ముగిసిన టెండర్ ప్రక్రియ-నేటికీ కానరాని కొత్త టెండర్ వివరాలు

-పర్యవేక్షణ కరువైందని ప్రజల ఆవేదన-నెలల తరబడి కనిపించని సంబంధిత శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది -ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన స్థానికులు



04

పాత ఇనుప దుకాణాల దందాకు అధికారుల అండదండలా?

సీతారామ ప్రాజెక్టు ఇనుప సామగ్రి స్వాహాపై అనుమానాలు!

మూడు పూలు.. ఆరు కాయలుగా సాగుతున్న వ్యాపారం

కాలుష్య నియంత్రణ గాలికి.. ప్రభుత్వ ఆస్తుల భద్రత ప్రశ్నార్థకం!

ఏ శాఖకు పట్టింపు లేదా? బాధ్యత ఎవరిది?



05

జీతం మణుగూరులో.. మకాం భద్రాచలంలో..!

మొదటిపేజీ తరువాయి

మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి సూపరింటెండెంట్ ఉన్నారా.. లేరా.. అంటే సమాధానం చెప్పేవారు లేరని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వ జీతం మణుగూరులో తీసుకుంటూ.. మకాం మాత్రం భద్రాచలంలో పెట్టారన్న తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. భద్రాచలంలో ఆయనకు సపరేట్ గా ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయని.. అందుకే ఎక్కువ సమయం అక్కడే ఉంటున్నారని పలువురు విమర్శిస్తున్నారు. భద్రాచలం నుంచి మణుగూరు కు గంట ప్రయాణం కావడంతో.. అత్యవసర పరిస్థితుల్లో రోగుల పరిస్థితి ఏంటని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. పేద రోగుల గోడు పట్టించుకునే దిక్కే లేదని.. ఉన్నతాధికారులు వెంటనే విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి /

మణుగూరు. నవంబర్ 21, ప్రజాజ్యోతి...



మణుగూరు ఏరియా వైద్యశాలలో పెద్ద స్థానంలో ఉండాల్సిన అధికారి జాడే కనిపించడం లేదని రోగుల బంధువులు వాపోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యం కోసం వచ్చే వారికి సరైన మార్గనిర్దేశం చేసేవారు కరువయ్యారని చెబుతున్నారు. ప్రమాదంలో గాయపడిన వారు, ప్రసవం కోసం వచ్చిన మహిళలు. జ్వరంతో అల్లాడుతున్న చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి దూరంగా ఉండటం వల్ల సిబ్బందిపై కూడా అదుపు లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు.. ఈ వ్యవహారంపై జిల్లా స్థాయి అధికారులు వెంటనే దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

సూపరింటెండెంట్ మణుగూరులో ఉండాలా..?

భద్రాచలంలో ఉండాలా..?

మణుగూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ విధుల నిర్వహణపై స్థానిక ప్రజల్లో తీవ్ర చర్చ జరుగుతోంది.. ఆసుపత్రి సూపరింటెండెంట్ మణుగూరు లో ఉండాలా..? భద్రాచలం లో ఉండా లా..? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహించాల్సిన అధికారి.. ఎక్కువ సమయం తన ప్రైవేటు ఆసుపత్రికే కేటాయిస్తున్నారనే ఆరోపణలు కూడా స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. హెడ్ క్వార్టర్స్ లోనే ఉండాలన్న నిబంధన ఉన్నా.. దానిని పాటించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఆసుపత్రికి పెద్ద దిక్కుగా ఉండాల్సిన వ్యక్తే అందుబాటులో లేకపోతే.. ఆసుపత్రి ఎలా నడుస్తుందని నిలదీస్తున్నారు..

ప్రయాణం గంట.. అత్యవసర ఆపరేషన్ల వేళ రోగుల

పరిస్థితి ఏంటి..?

భద్రాచలం నుంచి మణుగూరుకు సుమారు గంట ప్రయాణం ఉండే పరిస్థితుల్లో.. సూపరింటెండెంట్ భద్రాచలంలో ఉంటే మణుగూరు ఏరియా ఆసుపత్రిలో అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు రోగుల పరిస్థితి ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆసుపత్రిలో అత్యవసర ఆపరేషన్లు.. ప్రమాద కేసులు.. ప్రాణాపాయ పరిస్థితులు ఎదురైనప్పుడు సూపరింటెండెంట్ అందు బాటులో ఉంటున్నారా..? అని ప్రజలు అడగటం గమనార్హం. మరి ఆయన అందుబాటులో లేకపోతే అత్యవసర వైద్య సేవలను ఎవరు పర్యవేక్షి స్తున్నారు..? అనే అంశాలపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గంట ఆలస్యమైతే ప్రాణాలకే ప్రమాదం అని.. ఆ గంటలో రోగి పరిస్థితి విషమించే అవకాశం ఉందని వైద్య నిపుణులు కూడా చెబుతున్నారని స్థానికులు అంటున్నారు. ప్రసవం కోసం వచ్చిన మహిళలు.. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారు.. గుండెపోటుతో వచ్చిన వారు నరక యాతన పడుతున్నారని వాపోతున్నారు..

సూపరిం టెండెంట్ ఫోన్ చేసినా అందుబాటులో ఉండటం లేదని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు..

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల గోడు

పట్టించుకునేదెవరు..?

ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే పేద.. సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అయితే సూపరింటెండెంట్ ఎక్కువ సమయం తన ప్రైవేటు ఆసుపత్రికే పరిమిత మవుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో.. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల నిర్వహణపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లే స్తోమత లేకే పేదలు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్నారని.. అలాంటి వారిని పట్టించుకోక పోవడం దారుణమని అంటున్నారు. డాక్టర్లు ఉన్నారా.. లేరా.. మందులు ఉన్నాయా.. లేవా.. పరీక్షలు జరుగుతున్నాయా.. లేదా అని చూసే వారే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగులు గంటల తరబడి క్యూలో నిలబడినా.. సరైన వైద్యం అందడం లేదని వాపోతున్నారు. సూపరింటెండెంట్ పర్యవేక్షణ లేకపోవడంతో ఆసుపత్రిలో శుభ్రత కూడా కరువైందని విమర్శిస్తున్నారు. ప్రజల సొమ్ముతో నడిచే ఆసుపత్రిలో ప్రజలకే సేవలు అందకపోవడం సిగ్గుచేటని మండిపడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే.. జిల్లా కలెక్టర్.. జిల్లా వైద్యాధికారి వెంటనే స్పందించాలని కోరుతున్నారు.

జపాన్‌లో ముగిసిన జిల్లా కలెక్టర్ అంకిత్ జైకా అధ్యయన పర్యటన

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 21,(ప్రజా జ్యోతి) మొదటిపేజీ తరువాయి

కొత్తగూడెం జిల్లా కలెక్టర్ నీతి ఆయోగ్, జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా) సంయుక్తంగా ఆకాంక్షిత మండలాల కార్యక్రమం కింద జపాన్‌లో నిర్వహించిన అధ్యయన పర్యటనను విజయవంతంగా పూర్తి చేశారు. నవంబర్ 15 నుంచి 21 వరకు నిర్వహించిన ఈ పర్యటన ముగింపు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ధ్రువపత్రాన్ని అందుకున్నారు.ఈ అధ్యయన పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ అంకిత్ తన బృందంతో కలిసి 'నెరిమా నగరంలోని టొయోటామా ప్రాథమిక పాఠశాల నుంచి నేర్చుకున్న పాఠాలు' అనే అంశంపై సాంకేతిక, విధానపరమైన ప్రజెంటేషన్ ఇచ్చారు. పాఠశాల సందర్శన సందర్భంగా పరిశీలించిన విద్యా విధానాలు, బోధనా పద్ధతులు, పాఠశాల నిర్వహణ అంశాలను వివరించారు. వీటిలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, విద్యా ప్రమాణాల పెంపునకు అనుసరించదగిన విధానాలపై చర్చించారు.అదేవిధంగా స్థానిక పాలన, ప్రజలకు ప్రభుత్వ సేవల అందజేత, ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై నిర్వహించిన అధ్యయన సమావేశాలు, క్షేత్రస్థాయి సందర్శనల్లో కలెక్టర్ పాల్గొన్నారు. మిటో నగరంపై నిర్వహించిన కేస్ స్టడీ ద్వారా స్థానిక సంస్థలు ప్రజల అవసరాలను గుర్తించి, వాటికి అనుగుణంగా సేవలు అందిస్తున్న తీరును అధ్యయనం చేశారు. సోనీ సంస్థపై నిర్వహించిన కేస్ స్టడీలో సంస్థాగత మార్పుల అమలు, పనితీరు మెరుగుదలలో నాయకత్వ పాత్రకు సంబంధించిన అంశాలను పరిశీలించారు.జపాన్ పర్యటనలో అధ్యయనం చేసిన ఉత్తమ విధానాల్లో జిల్లాకు అనువైన అంశాలను గుర్తించి, వాటిని స్థానిక పరిస్థితులకు అనుగుణంగా అమలు చేసేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేయనుంది. ముఖ్యంగా ఆకాంక్షిత మండలాల్లో విద్య, ఆరోగ్యం, పోషణ రంగాల్లో సేవల నాణ్యతను మెరుగుపరిచేందుకు ఈ అధ్యయన పర్యటనలో పొందిన అనుభవాలు, సూచనలు ఉపయోగపడనున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో అమలవుతున్న ఉత్తమ విధానాలను జిల్లాలోని అభివృద్ధి కార్యక్రమాలకు అనుసంధానం చేయడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం కలగనుంది

మొదటిపేజీ తరువాయి

ప్రజాజ్యోతి కథనానికి స్పందన...

-మణుగూరులో మొదలైన రోడ్డు పనులు..!

-కాలుష్య కోరల్లో మణుగూరు అంటూ రాసిన కథనానికి ఫలితం...

-గుంతలు పూడ్చి.. దుమ్ము తగ్గించేలా రోడ్డు నిర్మాణం చేపట్టిన అధికారులు...

-ఎమ్మెల్యే చొరవతో కదిలిన యంత్రాంగం.. ప్రజల్లో హర్షం...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / ప్రజాజ్యోతి

మణుగూరు, నవంబర్ 21, ప్రజాజ్యోతి...



ప్రజాజ్యోతిలో వెలువడిన "కాలుష్య కోరల్లో మణుగూరు" అనే శీర్షికన వచ్చిన కథనానికి సత్వర స్పందన లభించింది.. మణు గూరు ప్రధాన రహ దారిపై గుంతలు ఉండటం తో.. వాహనాలు వెళ్తున్నప్పుడు దుమ్ము ధూళి ఎక్కువగా వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. శ్వాసకోశ సమస్యలు.. గుండె జబ్బులు వస్తున్నాయని ప్రజాజ్యోతి కథనంలో ప్రచురించిన సంగతి మనకందరికీ తెలిసిందే..

ఈ కథనాన్ని చూసిన స్థానిక ఎమ్మెల్యే.. అధికారులు వెంటనే స్పందించారు. గుంతలు ఉన్న చోట రోడ్డు నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. ప్రస్తుతం రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి.. కొత్త రోడ్డు వేసే పనులు వేగంగా జరుగుతున్నాయి. ఫోటోలో కనిపిస్తున్నట్లుగా.. రోలర్.. కార్మికులతో రోడ్డు పనులు జోరుగా సాగుతున్నాయి. గుంతల రోడ్డు వల్ల ఇన్ని రోజులు దుమ్ముతో ఇబ్బంది పడిన ప్రజలు.. ఇప్పుడు పనులు మొదలు కావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పేపర్ లో రాసిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు.. అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. రోడ్డు పనులు నాణ్యతగా పూర్తి చేసి.. దుమ్ము సమస్య శాశ్వతంగా తీర్చాలని కోరుతున్నారు..

చివరి తడి కోసం సీతారామ జలాలు విడుదల


కొత్తగూడెం కలెక్టరేట్ ,నవంబరు 21,(ప్రజాజ్యోతి)



పంటలు ఎండిపోకుండా చివరి తడి అందించి ఆదుకోవాలంటూ రైతులు చేసిన విజ్ఞప్తిపై రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తక్షణమే స్పందించారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను విడుదల చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు అధికారులు సాగునీటిని శనివారం విడుదల చేశారు.ప్రస్తుతం పంటలు కీలక దశలో ఉన్నాయని, చివరి తడి అందకపోతే దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సాగునీటి అవసరాన్ని వివరించి, వెంటనే నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. రైతుల విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించిన మంత్రి తుమ్మల అధికారులతో మాట్లాడి నీటి విడుదలకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

దీంతో వైరా--ఏన్కూరు, అన్నపురెడ్డిపల్లి, రామచంద్రపురం మేజర్ కాలువలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను అధికారులు విడుదల చేశారు. విడుదల చేసిన నీరు ఆదివారం నాటికి మేజర్ కాలువలకు చేరుకోనుంది. తద్వారా ఆయా కాలువల పరిధిలోని పంటలకు చివరి తడి అందే అవకాశం ఏర్పడింది.

రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విడుదల చేసిన గోదావరి జలాలను కేవలం పంటల సాగు అవసరాలకే వినియోగించుకోవాలని మంత్రి తుమ్మల సూచించారు. నీటిని వృథా చేయకుండా పొలాలకు అందేలా రైతులు సహకరించాలని కోరారు. చివరి తడి అందించడం ద్వారా పంటలను కాపాడి రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.రైతుల విజ్ఞప్తికి వెంటనే స్పందించి సాగునీరు విడుదల చేయించిన మంత్రి తుమ్మల నిర్ణయంపై ఆయా ప్రాంతాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అర్హులైన ప్రతి ఓటరుకు ఓటర్ల జాబితాలో చోటు కల్పించేందుకు ఇదే చివరి అవకాశం

ఏ ఎస్ డి డి జాబితాలో ఉన్న ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారంతో పాటు సంబంధిత అనెక్షర్ సమర్పించాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 21,(ప్రజాజ్యోతి)

శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సమీక్షించారు. కొత్తగూడెంలోని ఐడీఓసీ కార్యాలయం నుంచి జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఓటరుకు ఓటర్ల జాబితాలో చోటు కల్పించేందుకు ఎన్నికల సంఘం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నివాసం మార్చుకోని ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారంతో పాటు అనెక్సర్ 'బి'ని, రాష్ట్రంలోనే మరో ప్రాంతానికి నివాసం మార్చుకున్న ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారంతో పాటు అనెక్సర్ 'సి'ని తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ఇది చివరి అవకాశమని తెలిపారు. ఏ ఎస్ డి డి (గైర్హాజరు, నివాసం మార్చుకున్నవారు, మరణించినవారు, నకిలీ ఓటర్లు) జాబితాలో నమోదైన వారిలో అధిక శాతం పట్టణ ప్రాంతాలకు చెందినవారు ఉన్నందున ఆయా ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించినట్లు వివరించారు. ఏ ఎస్ డి డి తమ పేర్లు నమోదైన ఓటర్లు సూచించిన పత్రాలతో పాటు ఎన్యూమరేషన్ ఫారం, సంబంధిత అనెక్సర్ సమర్పించి ఓటర్ల జాబితాలో తమ పేర్లను నిర్ధారించుకోవాలని కోరారు. అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కును కోల్పోకుండా ఉండేందుకు ఎన్నికల సంఘం కల్పించిన ఈ చివరి అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గిన్నెల బేతాలుడి మాయాజాలం.. ఏసీబీ వలలో పడి

మొదటిపేజీ తరువాయి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు, నవంబర్ 21, ప్రజాజ్యోతి...



గిన్నెల దందాతో మొదలైన దబ్బు భూముల దందాలోకి, భూముల దందా నుంచి వచ్చిన పట్టు సింగరేణి ప్యాకేజీల దందాలోకి మళ్లిందన్నదే ఇప్పుడు మణుగూరులో వినిపిస్తున్న ప్రధాన ఆరోపణ. గిన్నెల వ్యాపారం ద్వారా సమకూరిన డబ్బుతో వేల ఎకరాలు ఎలా కొనుగోలు చేశారన్న ప్రశ్నకు సమాధానం లేదు. ఆ భూముల ఆధారంగానే సింగరేణి ఓసీ విస్తరణ సర్వేలో సుమారు 50 మంది డూప్లికేట్ పేర్లను చేర్పించి, ఒక్కో పేరుపై వచ్చే ప్యాకేజీని కొల్లగొట్టాలని చూశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గిన్నెల నుంచి భూమికి, భూమి నుంచి ప్యాకేజీకి ఇదంతా ఒకే గొలుసులా నడిచిందా అన్నదే ఇప్పుడు జనం అడుగుతున్న ప్రధాన ప్రశ్న. ఈ మూడు దందాల లెక్క తేలాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గిన్నెల డబ్బు.. భూమిగా మారి.. ప్యాకేజీగా మారిందా?

పాత్రల విక్రయంతో సంపాదించిన సొమ్ము స్థిరాస్తుల రూపంలోకి మారిందన్న అనుమానమే ఇప్పుడు మణుగూరులో కలకలం రేపుతోంది. గిన్నెల బేతాలుడి పేరిట వేల ఎకరాలు ఎలా పోగయ్యాయన్న ప్రశ్నకు ఇప్పటివరకు ఎక్కడా స్పష్టత లేదని స్థానికులు అంటున్నారు. ఆ స్థిరాస్తుల ఆధారంగానే సింగరేణి ఓసీ విస్తరణ లెక్కింపులో లబ్ధి పొందేందుకు ప్రయత్నం జరిగిందన్న చర్చ జరుగుతోంది. పాత్రల నుంచి పొలం వరకు, పొలం నుంచి పరిహారం వరకు సాగిన ఈ ప్రయాణంలో లెక్క తేడా కొడుతోందని గిరిజనులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ మూడు దశల మధ్య సంబంధం ఏమిటో ఉన్నతాధికారులు తేల్చాలని వారు కోరుతున్నారు.

50 పేర్లు.. ఒక్కో పేరు వెనుక లక్షల పరిహారం..!

సింగరేణి ఓసీ విస్తరణ కోసం జరిగిన నమోదు ప్రక్రియలో అనుమానాస్పద పేర్లు చేరాయన్న విమర్శలు ఇప్పుడు ముందుకు వచ్చాయి. అర్హత లేని సుమారు యాభై మంది పేర్లు జాబితాలోకి ఎలా వచ్చాయన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ఆ పేర్ల ద్వారా వచ్చే నష్టపరిహారాన్ని చేజిక్కించుకునే యత్నం జరిగిందని, గిన్నెల బేతాలుడు వెనుక ఉండి ఈ తతంగం నడిపించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జాబితాను మళ్లీ పరిశీలించి, అసలు లబ్ధిదారులు ఎవరో తేల్చాలని గిరిజనులు, స్థానిక రైతులు డిమాండ్ చేస్తున్నారు.

బేతానికి ఒక పత్రిక అండ.. కథనం వచ్చినా ఏమీ కాదని భరోసా..!

బేతాలుడి వెనుక ఓ పత్రిక యాజమాన్యం అండగా నిలుస్తోందన్న చర్చ ఇప్పుడు మణుగూరులో జోరుగా సాగుతోంది. కథనం వచ్చినా భయం లేదు, మేము చూసుకుంటాం అని ఆ యాజమాన్యం భరోసా ఇస్తున్నట్లు స్థానిక వర్గాలు చెబుతున్నాయి. ఇలాంటి వ్యవహారాల్లో చొరబడి అక్రమాలకు పాల్పడే వారికి ఆ పత్రిక చేయూతనిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలోనూ మణుగూరులో ఓ వ్యాపారి ఐపీ పెడితే, ఆ వ్యాపారికి ఇదే పత్రిక మద్దతు తెలిపి సెటిల్‌మెంట్ చేయించిందన్న ప్రచారం కూడా జరుగుతోందని స్థానికులు అంటున్నారు. పత్రిక ముసుగులో ఉండి, ఒకే సామాజిక వర్గం కావడంతో అక్రమార్కులను కాపాడటం సరైనది కాదని మేధావులు అంటున్నారు. పత్రిక ప్రజల ప్రయోజనం కోసం పని చేయాలి తప్ప, అక్రమార్కులకు అండగా నిలవడం సరైన పద్ధతి కాదని స్థానికులు చెబుతున్నారు. గిరిజన ప్రాంతంలో గిరిజనులకు లేని ఆస్తులు వీరికి ఎలా వస్తున్నాయని పలువురు మేధావులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బేతాలుడి ఆస్తులు, భూములు, బ్యాంక్ లావాదేవీలపై ఏసీబీ, ఐటీ, ఈడీ సంయుక్తంగా సోదాలు చేసి, నిజాలు బయటకు తీయాలని గిరిజనులు, రైతులు, మేధావులు డిమాండ్ చేస్తున్నారు.

నాటు సారా విక్రయదారులపై బైండోవర్ కేసులు

-ఏడుగురికి తహసీల్దార్ ఎదుట బైండోవర్.. మళ్లీ పట్టుబడితే లక్ష జరిమానా, ఏడాది జైలు శిక్ష

పినపాక,నవంబర్ 21(ప్రజాజ్యోతి)



పినపాక మండలంలో నాటు సారా విక్రయాలకు పాల్పడుతున్న ఏడుగురిపై ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టారు. వివిధ గ్రామపంచాయతీలకు చెందిన ఏడుగురిని గుర్తించి పినపాక తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ కేసులు నమోదు చేసి హెచ్చరికలు జారీ చేశారు.మండలంలోని ఎల్చిరెడ్డిపల్లి గ్రామపంచాయతీకి చెందిన ఇద్దరు, భూపాలపట్నం గ్రామపంచాయతీకి చెందిన ముగ్గురు, దుగినపల్లి గ్రామపంచాయతీకి చెందిన ఇద్దరు నాటు సారా విక్రయదారులను ఎక్సైజ్ అధికారులు గుర్తించారు. ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వీరిని పినపాక తహసీల్దార్ కార్యాలయంలో హాజరుపరిచి బైండోవర్ చేయడం జరిగింది.ఈ సందర్భంగా పినపాక తహసీల్దార్ జి. శ్రీనివాసరావు నాటు సారా విక్రయాలకు పాల్పడవద్దని వారిని మందలించారు. బైండోవర్ అయిన అనంతరం ఏడాది కాలంలో మళ్లీ నాటు సారా విక్రయాలు చేస్తూ పట్టుబడితే రూ.లక్ష జరిమానాతో పాటు ఏడాది జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. మండలంలో నాటు సారా తయారీ, విక్రయాలు, అక్రమ రవాణాపై నిరంతర నిఘా కొనసాగిస్తామని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి హానికరమైన నాటు సారా విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్, ఎక్సైజ్ అధికారులు స్పష్టం చేశారు.

ప్రజల ప్రాణాలంటే

మొదటిపేజీ తరువాయి

అంత అలుసా?

ఇల్లందు, నవంబర్ 21 (ప్రజా జ్యోతి)

ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉన్నప్పటికీ, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మేకల వధకు సంబంధించిన కమేళాలో నిబంధనలు పాటించడం లేదని, ఇష్టానుసారంగా మేకలను వధిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారా? ప్రజారోగ్యం పట్ల ఇంత నిర్లక్ష్యమా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా కమేళాకు మున్సిపల్ పరిధిలో టెండర్ ప్రక్రియ ద్వారా కాంట్రాక్టర్ కు ఇవ్వడం జరుగుతుంది. సదరు కాంట్రాక్టర్ ప్రతిరోజు కమేళా వద్దకు వెళ్లి పశు వైద్యాధికారి సమక్షంలో మేకలను పరీక్షించిన అనంతరం కోసిర వాటికి లెక్కలు కట్టి డబ్బులు వసూలు చేయడం జరుగుతుంది. కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తి మున్సిపాలిటీకి పలు దఫాలుగా కాంట్రాక్టుకు సంబంధించి డబ్బులను చెల్లించాల్సి ఉంటుంది. కానీ సుమారుగా రెండేళ్లకు పైగా కమేళా కాంట్రాక్టు పూర్తయినప్పటికీ పలుమార్లు కాంట్రాక్టుకు సంబంధించి టెండర్ నోటీసు ఇచ్చినప్పటికీ ఎవరు ఆసక్తి చూపలేదని సమాచారం. దీనిని అదునుగా భావించిన వ్యాపారస్తులు వారు ఇష్టానుసారంగా మేకలను వధిస్తున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. మేక ఆరోగ్యంగా ఉందా... అనారోగ్యంగా ఉందో పరీక్షించే అధికారి లేకపోవడం వారికి మరింతగా కలిసివచ్చే విషయమని, దానిని అదునుగా చూసుకొని ఇష్టం వచ్చినట్లు మేకలను వధిస్తున్నారని ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు.





నిబంధనలు పాటించకుండా మేకల వధ?

కమేళాలో మేకల వధకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు అమలు కావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మేకలను వధించే ముందు వాటి ఆరోగ్య పరిస్థితులను సంబంధిత పశువైద్య అధికారులు పరిశీలించాల్సి ఉన్నప్పటికీ, అలాంటి తనిఖీలు జరుగుతున్న దాఖలాలు కనిపించడం లేదని చెబుతున్నారు. సంబంధించి అనారోగ్యంతో ఉన్న మేకలను సైతం వధిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఆ మాంసాన్ని కొనుగోలు చేసి వినియోగించే ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుంది.

మృతి చెందిన మేకలను సైతం కోస్తున్నారా?

కమేళాలో మృతి చెందిన మేకలను సైతం కమేళాలోకి తీసుకొచ్చి వధిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే నిజమైతే ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై అధికారులు తక్షణమే విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని కోరుతున్నారు. ఆహార భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? మాంసం విక్రయానికి ముందు నాణ్యతా పరీక్షలు నిర్వహిస్తున్నారా? అనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా కమేళా నిర్వహించే కాంట్రాక్టర్ లేకపోవడంతో వధించిన మేక వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడవేయడంతో కుక్కలు వాటిని పక్కనే ఉన్న పలువురి ఇండ్లలో పడవేయడంతో కొంత ఇబ్బందులు పడవలసి వస్తుంది. మరి ముఖ్యంగా కార్తీక మాసం కావడంతో మహిళలు, అయ్యప్ప మాలధారలు వేసిన స్వాములు ఉదయం సాయంత్రం పూజలు చేయడం జరుగుతుంది. భరించిన మేకల వ్యర్థాలను ఇండ్లలోకి కుక్కలు తీసుకురావడం వల్ల తమకు ఇబ్బందులు కలుగుతున్నాయని వాటిని పరిష్కరించాలని కోరుతున్నారు.

టెండర్ ముగిసి రెండేళ్లకు పైగా.. కొత్త ప్రక్రియ ఎక్కడ?

ఇల్లందు మున్సిపల్ పరిధిలో కమేళాకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయి దాదాపు రెండేళ్లు గడిచినా, తదుపరి టెండర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలు ప్రజలకు స్పష్టంగా తెలియడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. టెండర్ గడువు ముగిసిన తర్వాత కూడా నిర్వహణ ఎవరి ఆధ్వర్యంలో కొనసాగుతుంది? నిబంధనల ప్రకారం కొత్త టెండర్ నిర్వహించారా? నిర్వహించినట్లయితే దాని వివరాలు ఏమిటి? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై మున్సిపల్ అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కమేళాలో పారిశుద్ధ్యం ఎక్కడ?

కమేళా పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై కూడా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వధ అనంతరం వెలువడే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారా? రక్తం, ఇతర వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు తీసుకుంటున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పరిశుభ్రత పాటించకపోతే దుర్వాసనతో పాటు దోమలు, ఈగలు, ఇతర వ్యాధికారక క్రిములు వ్యాపించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

నెలల తరబడి కానరాని అధికారులు!

ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది నెలల తరబడి కమేళా వైపు కన్నెత్తి చూడటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని వాపోతున్నారు. పశు సంవర్ధక శాఖ, మున్సిపల్ శాఖ, ఆహార భద్రతా విభాగం అధికారులు సమన్వయంతో తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కనిపించడం లేదని విమర్శిస్తున్నారు.

అడిగేవారు లేరనే ధీమాతోనేనా?

కమేళా నిర్వహణపై ప్రశ్నించే వారు లేకపోవడంతో కొందరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారా? అనే అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అత్యంత కీలకమైన అంశంలో ఇంతటి నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు..

కమేళాలో నెలకొన్న సమస్యలపై స్థానిక అధికారుల దృష్టికి ఆ ప్రాంత ప్రజా ప్రతినిధులు, ప్రజలు పలుమార్లు తీసుకుపోయినప్పటికీ ఆ సమస్య పరిష్కారం కాకపోవడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కమేళాను ఆకస్మికంగా తనిఖీ చేయాలని, టెండర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను బహిర్గతం చేయాలని, మేకల ఆరోగ్య పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే కమేళాలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచడంతో పాటు, మృతి చెందిన లేదా అనారోగ్యంతో ఉన్న మేకలను వధించకుండా కఠినమైన పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. బాధ్యులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన మాంసం అందించడం అధికారుల బాధ్యత అని, ప్రజారోగ్యానికి సంబంధించిన ఈ సమస్యను ఇకనైనా అధికారులు తీవ్రంగా పరిగణించి తక్షణ చర్యలు చేపడతారా? లేక ప్రజల ఫిర్యాదులు కాగితాలకే పరిమితం అవుతాయా? అనేది వేచి చూడాల్సిందే.

టెండర్ ప్రక్రియ చేపడతాం: సందీప్, కమీషనర్, మున్సిపాలిటీ, ఇల్లందు

ఇల్లందు మున్సిపల్ పరిధిలో నిర్వహించే కమేళా టెండర్ ప్రక్రియ పూర్తయి దాదాపు రెండేళ్లు అవుతుంది. ఈ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎజెండాలో పొందుపరిచి టెండర్ ప్రక్రియ ప్రారంభిస్తాం. గతంలో పలుమార్లు టెండర్లకు ఆహ్వానించినప్పటికీ ఎవరు ఆసక్తి చూపలేదు. అందుకే కమేళా టెండర్ ప్రక్రియ ఆలస్యం అయింది.



వీబీ జీ రామ్ జీ పథకం లక్ష్యాలను గడువులోగా సాధించాలి

అధికారులకు ఐటీడీఏ పీవో బి. రాహుల్ ఆదేశం

భద్రాచలం, నవంబర్ 21 (ప్రజా జ్యోతి):

జిల్లాలో వీబీ జీ రామ్ జీ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి, ఉపాధి హామీ పనుల లక్ష్యాలను 15 రోజుల్లోగా సాధించాలని ఐటీడీఏ పీవో బి. రాహుల్ అధికారులను ఆదేశించారు.
శనివారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, ఈజీఎస్ ఏపీవోలు, ఇంజినీర్లతో మండలాల వారీగా పనుల పురోగతిని సమీక్షించారు. కొత్త జాబ్ కార్డుల జారీ, కూలీల సమీకరణ, మేట్ల గుర్తింపు, సగటు వేతనం, లేబర్ బడ్జెట్, పనుల జాబితా తయారీపై సమీక్షించి, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.
జలసిరి కార్యక్రమంలో ఫామ్ పాండ్స్, పెర్కొలేషన్ ట్యాంకులు, సోక్ పిట్స్, బోర్‌వెల్ రీచార్జ్ పనులు, పశువుల నీటి తొట్లు, పశుగ్రాస అభివృద్ధి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ద్వారా కూలీలకు ఉపాధి కల్పించాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, పారిశుద్ధ్య సముదాయాలు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు, గ్రామపంచాయతీ, అంగన్‌వాడీ, స్వయం సహాయక సంఘాల భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు.
డీఆర్‌డీఓ విద్యాచందన మాట్లాడుతూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి, పత్రాలను పరిశీలించి వివరాలను ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు.
ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున పశుసంపద సంరక్షణకు పశుగ్రాస అభివృద్ధి కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఐదు ఎకరాల లోపు భూమి కలిగి, నీటి సౌకర్యం ఉన్న రైతులు తమ భూముల్లో పశుగ్రాసం సాగు చేసుకోవచ్చని, ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఓ జనరల్ డేవిడ్ రాజ్, ఎంపీడీవోలు, ఇంజినీర్లు, ఈజీఎస్, పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

నిరుపేద వృద్ధురాలి అంత్యక్రియలకు ఆర్థిక సాయం మానవత్వం చాటిన కాంగ్రెస్ నాయకుడు జిందా

భద్రాచలం, నవంబర్ 21 (ప్రజా జ్యోతి):

పట్టణ పరిధిలో అనారోగ్యంతో మృతి చెందిన నిరుపేద వృద్ధురాలు నర్సమ్మ అంత్యక్రియలను భద్రాద్రి జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి, షాజ్ బ్లడ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి మహమ్మద్ జిందా దగ్గరుండి నిర్వ హించారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలనే మానవతా దృక్పథంతో వృద్ధురాలి దహన సంస్కార బాధ్యతలను స్వయంగా తీసు కున్నారు. ఈ సందర్భంగా అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేయడమే కాకుండా, అన్ని ఏర్పా ట్లను పర్యవేక్షించి అంత్యక్రియలు పూర్తి చేయించారు. నిరు పేదలు, అనాథలు కష్టాల్లో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడమే నిజమైన మానవ సేవ అనే సందేశాన్ని తన సేవా కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు. వృద్ధురాలికి ఆపన్నహస్తం అందించి, గౌరవప్రదంగా అంతిమ సంస్కారాలు నిర్వహించిన మహమ్మద్ జిందా మానవతా దృక్పథాన్ని పలువురు అభి నందించారు.



పాత ఇనుప దుకాణాల దందాకు అధికారుల అండదండలా?

మొదటిపేజీ తరువాయి

అశ్వాపురం, నవంబర్ 21,ప్రజాజ్యోతి

అశ్వాపురం: మండలంలో పాత ఇనుప సామానుల కొనుగోలు, విక్రయాల వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వ్యాపార నిర్వహణకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? కొనుగోలు చేస్తున్న ఇనుప సామగ్రికి సరైన ఆధారాలు ఉన్నాయా? ప్రభుత్వ ప్రాజెక్టులకు సంబంధించిన ఇనుప ముక్కలు ప్రైవేటు వ్యాపారుల చేతుల్లోకి చేరుతున్నాయా? అనే అనుమానాలు స్థానికంగా చర్చనీయాంశమవుతున్నాయి. మరోవైపు ఇనుప దుకాణాల వద్ద నిల్వలు, కటింగ్ పనులు, వ్యర్థాల నిర్వహణ కారణంగా కాలుష్య సమస్యలు తలెత్తుతున్నా సంబంధిత శాఖలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

సీతారామ ప్రాజెక్టు ఇనుప సామగ్రి ఏమవుతోంది?

ప్రతిష్ఠాత్మక సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పాత ఇనుప సామగ్రి, మిగులు వస్తువులు, వినియోగం లేని పరికరాల తరలింపుపై స్పష్టత అవసరం. ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన ఇనుప సామగ్రి అధికారిక వేలం ద్వారా విక్రయిస్తున్నారా? లేక ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి చేరుతోందా? విక్రయాలకు సంబంధించిన రికార్డులు ఎక్కడ ఉన్నాయి? అనే ప్రశ్నలకు ప్రాజెక్టు అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. అక్రమ తరలింపు జరిగినట్లు ఆధారాలు లభిస్తే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

పంచాయతీ కార్యదర్శి బాధ్యత ఏమిటి?

గ్రామపంచాయతీ పరిధిలో వ్యాపార నిర్వహణకు అవసరమైన స్థానిక అనుమతులు, ట్రేడ్ లైసెన్సులు, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శి, సంబంధిత పంచాయతీ అధికారులపై ఉంటుంది. నివాస ప్రాంతాల మధ్య ఇనుప దుకాణాలు నిర్వహిస్తున్నారా? రహదారులను ఆక్రమిస్తున్నారా? వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారా? అనే అంశాలపై తనిఖీలు నిర్వహించాలి. నిబంధనల ఉల్లంఘన జరిగితే పంచాయతీ చట్టం ప్రకారం చర్యలు చేపట్టాలి.

కాలుష్య నియంత్రణ మండలి ఏం చేస్తోంది?

ఇనుప సామగ్రి కటింగ్, వెల్డింగ్, ఇతర పారిశ్రామిక కార్యకలాపాల స్వభావాన్ని బట్టి వర్తించే కాలుష్య నియంత్రణ నిబంధనలను పరిశీలించాల్సిన బాధ్యత తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలిపై ఉంటుంది. దుమ్ము, శబ్ద కాలుష్యం, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ నిబంధనల ఉల్లంఘనలపై తనిఖీలు చేపట్టాలి. అవసరమైన అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కార్యకలాపాలు గుర్తిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి.

రెవెన్యూ శాఖ పర్యవేక్షణ ఏదీ?

ప్రభుత్వ భూములు, రహదారులు, ఇతర ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ఇనుప సామగ్రి నిల్వ చేస్తున్నారా? ప్రభుత్వ ఆస్తులను అక్రమంగా వినియోగిస్తున్నారా? అనే అంశాలను రెవెన్యూ అధికారులు పరిశీలించాలి. ప్రభుత్వ భూముల ఆక్రమణలు గుర్తిస్తే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు చేపట్టాలి.

పోలీసుల నిఘా ఎక్కడ?

దొంగతనానికి గురైన ఇనుప సామగ్రి లేదా ప్రభుత్వ ఆస్తులు అక్రమంగా కొనుగోలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందితే పోలీసులు విచారణ చేపట్టాలి. అనుమానాస్పదంగా తరలిస్తున్న ఇనుప సామగ్రికి సంబంధించిన పత్రాలను పరిశీలించి, నేరం జరిగినట్లు ఆధారాలు ఉంటే కేసులు నమోదు చేయాలి. పాత ఇనుము వ్యాపారం పేరుతో చోరీ సొత్తు కొనుగోలు చేసే అవకాశాలను అరికట్టేందుకు నిఘా పెంచాలి.

కార్మిక, పరిశ్రమల శాఖల బాధ్యతలు ఏమిటి?

దుకాణాల్లో కార్మికులతో ప్రమాదకర పరిస్థితుల్లో పనులు చేయిస్తున్నారా? భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే అంశాలను వర్తించే కార్మిక చట్టాల పరిధిలో సంబంధిత అధికారులు పరిశీలించాలి. వ్యాపార కార్యకలాపాల స్వభావాన్ని బట్టి పరిశ్రమల శాఖ పరిధిలోకి వచ్చే అనుమతులు, నిబంధనలు వర్తిస్తున్నాయా లేదా అన్నది కూడా పరిశీలించాలి.

అధికారుల మధ్య సమన్వయం లేదా?

ఒక శాఖపై మరో శాఖ బాధ్యత నెట్టేసే ధోరణి వల్లే ఇలాంటి సమస్యలు కొనసాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. పంచాయతీ, రెవెన్యూ, పోలీస్, కాలుష్య నియంత్రణ మండలి, కార్మిక శాఖ, ప్రాజెక్టు అధికారులు సమన్వయంతో తనిఖీలు నిర్వహిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలి!

జిల్లా కలెక్టర్, సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి అశ్వాపురం మండలంలోని పాత ఇనుప దుకాణాలపై సమగ్ర విచారణకు ఆదేశించాలి. వ్యాపార అనుమతులు, కొనుగోలు విక్రయాల రికార్డులు, ఇనుప సామగ్రి మూలాలు, ప్రభుత్వ ప్రాజెక్టుల నుంచి తరలించిన సామగ్రి వివరాలను పరిశీలించాలి. నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

ఇనుప దుకాణాలపై తనిఖీలు చేయాల్సిన శాఖలు ఎన్నో.. కానీ క్షేత్రస్థాయిలో చర్యలు ఎక్కడ? ప్రభుత్వ ఆస్తుల రక్షణ, ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ అధికారుల బాధ్యత కాదా? ఇప్పటికైనా సంబంధిత శాఖలు మేల్కొని అక్రమాలపై ఉక్కుపాదం మోపుతాయా? అన్నది వేచి చూడాలి!

గిరిజనుల జోలికొస్తే ఖబర్దార్ ...!

నిరసనలు, రాస్తారోకోతో దద్దరిల్లిన భద్రాచలం

గిరిజన యువకుడు తెల్లం శరత్

హత్య ఘటనపై “గర్జించిన ఆదివాసి” సంఘాలు

భద్రాచలంలో “బంద్” సంపూర్ణం

మద్దతు తెలిపిన రాజకీయ పార్టీలు, కుల సంఘాలు

నిందితులను కఠినంగా శిక్షించాలి,

గిరిజన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి,

ఆదివాసి సంఘాల జేఏసీ నాయకులు,

రాజకీయ పార్టీ నాయకులు డిమాండ్







భద్రాచలం, నవంబర్ 21 (ప్రజా జ్యోతి):

భద్రాచలం పట్టణంలోని రామాలయం సమీపంలోని ఒక ప్రైవేటు లాడ్జిలో చోటు చేసుకున్న ఘర్షణలో ఆదివాసీ యువకుడు తెల్లం శరత్ పై దాడి, మృతి ఘటనకు నిరసనగా ఆదివాసీ సంఘాల జేఏసీ శనివారం నిర్వహించిన పట్టణ బంద్ విజయవంతమైంది. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాల నాయకులు శనివారం బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ పిలుపునకు పట్టణంలోని వ్యాపార, వాణిజ్య వర్గాలు స్వచ్ఛందంగా మద్దతు తెలిపి దుకాణాలు, వ్యాపార సంస్థలను మూసివేసి నిరసనకు సంఘీభావం ప్రకటించాయి. బంద్ నైపద్యంలో తెల్లవారుజాము నుండి ఆదివాసీ జేఏసీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని ప్రధాన రహదారులపై ద్విచక్ర వాహనాలతో తిరుగుతూ బంద్‌ను పర్యవేక్షించారు. వ్యాపార సంస్థలను మూసివేయాలని కోరుతూ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో పట్టణంలోని ప్రధాన కూడళ్లు, వ్యాపార కేంద్రాలు నిర్మానుష్యంగా కనిపించాయి. వ్యాపార వర్గాలు స్వచ్ఛందంగా సహకరించడంతో బంద్ ప్రభావం పట్టణ మంతటా కనిపించింది. బంద్ నైపద్యంలో పట్టణంలోని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భద్రాచలం డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అదేవిధంగా పట్టణ సీఐ సట్ల రాజు, ఎస్సై రామకృష్ణ, ట్రాఫిక్ ఎస్ఐ కేశవ్ ఎప్పటికప్పుడు పట్టణంలో తిరుగుతూ పర్యవేక్షించారు. ముఖ్య కూడళ్లు, సున్నిత ప్రాంతాల్లో పోలీసు సిబ్బందిని మోహరించారు. శరత్ మృతికి కారణమైన లాడ్జి సమీపంలో పోలీసు బందోబస్తు కొనసాగించారు. ఇదిలా ఉండగా, ఈ కేసులో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నిందితులను

మీడియా ఎదుట ప్రవేశపెట్టి కేసుకు సంబంధించిన వివరాలను సైతం వెల్లడించారు. బంద్ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై పోలీసులు, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. పట్టణ ప్రజలు, వ్యాపార వర్గాల మద్దతుతో బంద్ ప్రశాంతంగా ముగిసింది.

దండు సారయ్యను సన్మానించిన జాజుల శ్రీనివాస్

ఇల్లందు, నవంబర్ 21 (ప్రజా జ్యోతి)

ఇల్లందు మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు కౌన్సిలర్ గా విజయం సాధించిన దండు సారయ్యను శనివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పూలమాలవేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండాలని కోరారు. నిత్యం ప్రజల్లో ఉంటే వారే గుండెల్లో పెట్టుకుంటారన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించేందుకు నిత్యం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్, పలువురు బిసి సంఘాల నేతలు పాల్గొన్నారు.



ఐటీడీఏ పరిపాలన అధికారిగా సున్నం రాంబాబు సేవలు ప్రశంసనీయం

భద్రాచలం ఐటీడీఏ పీవో బి. రాహుల్

భద్రాచలం, నవంబర్ 21 (ప్రజా జ్యోతి):

ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతులు, బదిలీలు సహజమని, బాధ్యతగా విధులు నిర్వహిస్తూ గిరిజనులకు సేవలందించడం గొప్ప విషయమని ఐటీడీఏ పీవో బి. రాహుల్ అన్నారు. శనివారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటీడీఏకు ఏపీవో (జనరల్)గా పదోన్నతిపై బదిలీ అయిన సున్నం రాంబాబుకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఐటీడీఏ పరిపాలన అధికారిగా గిరిజనులకు విశిష్ట సేవలందించి, అనతికాలంలోనే పదోన్నతి పొందడం అభినంద నీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.అనంతరం సున్నం రాంబాబు మాట్లా డుతూ రెండేళ్లుగా ఐటీడీఏలో పరిపాలన అధికారిగా పనిచేస్తూ పీవో, ఉన్నతాది కారుల సహకారంతో గిరిజనులకు సేవలందించే అవ కాశం లభించిందన్నారు. సహకరించిన అధికారులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. తన వల్ల ఎవరికైనా ఇబ్బంది కలిగితే మన్నించాలని కోరారు.ఎఅనంతరం యూనిట్ అధికారులు, సిబ్బంది సున్నం రాంబాబును ఘనంగా సన్మానించారు.



ప్రపంచ స్థాయి ప్రమాణాలతో డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ అభివృద్ధి

యూనివర్సిటీ అభివృద్ధికి త్వరలో నిధులు..

వైస్ ఛాన్సలర్, బోధనా సిబ్బంది నియామకాలు-మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కొత్తగూడెం కలెక్టరేట్ ,నవంబర్ 21,(ప్రజా జ్యోతి)



డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన ప్రతిష్టా త్మక విద్యాసంస్థగా తీర్చిదిద్దు తామని రాష్ట్ర వ్యవ సాయ, సహకార, మార్కెటింగ్ చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్‌గా 1976లో ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం విశ్వవిద్యాలయంలో నిర్వహించిన స్వర్ణోత్సవ వేడుకలకు కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌తో కలిసి మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ 1976లో అప్పటి ప్రభుత్వం ఖనిజ సంపదకు నిలయమైన కొత్తగూడెం ప్రాంతంలో మైనింగ్ విద్య అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఐదు దశాబ్దాలుగా ఈ విద్యాసంస్థ మైనింగ్ రంగానికి నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందిస్తోందని అన్నారు . ఇక్కడ విద్యనభ్యసించిన వేలాది మంది విద్యార్థులు సింగరేణి, కోల్ ఇండియా, కేంద్ర ప్రభుత్వంలోని వివిధ శాఖలతో పాటు దేశ విదేశాల్లో ఉన్నత పదవులు చేపట్టి సంస్థకు, ప్రాంతానికి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చారని కొనియాడారు. పూర్వ విద్యార్థుల అనుభవం, సూచనలు, సహకారం విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. కొత్తగూడెం జిల్లాలో అపారమైన ఖనిజ సంపద, సహజ వనరులు ఉన్నందున వాటి అన్వేషణ, వెలికితీత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆవిష్కరణలతో పాటు భూగర్భ, భూ విజ్ఞాన శాస్త్రాలపై సమగ్ర పరిశోధనలు జరిగేలా ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి విశ్వవిద్యాలయ ఏర్పాటుకు సహకరించారని తెలిపారు. దేశ ఆర్థిక అభివృద్ధికి విశేష సేవలందించిన మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు ఈ విశ్వవిద్యాలయానికి పెట్టడం గర్వకారణమన్నారు. ఈ విశ్వవిద్యాలయం ద్వారా ఖనిజ వనరుల అన్వేషణ, ఆధునిక మైనింగ్ విధానాలు, సాంకేతిక పరి శోధనలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని పేర్కొన్నారు. విశ్వ విద్యాలయానికి అవసరమైన పూర్తిస్థాయి వైస్ ఛాన్సలర్, బోధనా సిబ్బంది నియామకాలతో పాటు మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. పూర్వ విద్యార్థులు సూచించిన అర్హులైన నిపుణుల పేర్లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే వైస్ ఛాన్సలర్ నియామకం చేపడ తామని వెల్లడించారు. విశ్వవిద్యాలయం అభివృద్ధి కోసం సింగరేణి, కోల్ ఇండియా తదితర సంస్థల సహకారంతో అవసరమైన నిధులు సమీకరిస్తామని తెలిపారు. కోల్ ఇండియా, సింగరేణి, ఎన్ఎండీసీ వంటి సంస్థలు, ఐఐటీలు, ఇతర విద్యా, పరిశోధనా సంస్థల ప్రతినిధులతో హైదరాబాద్‌లో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి సమగ్ర అభివృద్ధి రోడ్‌మ్యాప్ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవం, పరిచయాలను ఉపయోగించి విశ్వవిద్యాలయానికి ఆర్థిక సహకారంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, నిపుణుల సేవలు అందించాలని మంత్రి కోరారు. మైనింగ్ రంగంలో వారు సంపాదించిన అనుభవాన్ని విద్యార్థులకు అందించడం ద్వారా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన యువతను తయారు చేయవచ్చన్నారు.అనంతరం కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్ 50 సంవత్సరాల ప్రస్థానం ఎంతో గర్వకారణమన్నారు. ఈ విద్యాసంస్థలో చదువుకున్న పలువురు సింగరేణి, కోల్ ఇండియా వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో ఉన్నత స్థాయికి ఎదిగి దేశానికి సేవలందించారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో ఈ విద్యాసంస్థ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయంగా రూపాంతరం చెందడం అభినందనీయమన్నారు. విశ్వవిద్యాలయంలో పూర్తిస్థాయి ఫ్యాకల్టీ, బోధనా సిబ్బంది నియామకాలు, అన్ని విభాగాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. విశ్వవిద్యాలయ పరిధిలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన భారీ క్రీడా స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయని, సుమారు 50 నుంచి 60 ఎకరాల విస్తీర్ణంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేస్తే అంతర్జాతీయ క్రీడా పోటీల నిర్వహణకు అవకాశం ఉంటుందని అన్నారు . విశ్వవిద్యాలయ అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.250 కోట్ల నిధుల కేటాయింపు ప్రతిపాదనను ప్రస్తావిస్తూ, ఆ నిధులతో విశ్వవిద్యాలయ అభివృద్ధి, ఆధునిక ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలతో చదువుకుని దేశానికి సేవలందించాలని పిలుపునిచ్చారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవడంతో పాటు సంస్థ అభివృద్ధికి సమష్టిగా కృషి చేసే వేదికగా నిలుస్తుందని అన్నారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మైనింగ్ ఇంజనీరింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా స్టూడెంట్ చాప్టర్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు అసోసియేషన్ తరఫున ధ్రువపత్రాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, పాల్వంచ తహసీల్దార్ ధారా ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి అనూష, విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు బిక్కి రమేష్ కుమార్, సీనియర్ పూర్వ విద్యార్థులు, మైనింగ్ రంగ నిపుణులు, విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జీవిత బీమా కుటుంబానికి ఒక భరోసా

ఇల్లందు, నవంబర్ 21 (ప్రజా జ్యోతి)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ఒక భరోసా లాంటిదని ఇందిరానగర్ సర్పంచ్ పాయం లలిత అన్నారు. శనివారం ఇందిరా నగర్ గ్రామపంచాయతీలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఆన్లైన్లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగమణి, వార్డు సభ్యులు సుదర్శన్, రమాదేవి, సుజాత, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు రమణయ్య, యాకూబ్, ప్రజలు పాల్గొన్నారు.



మైనింగ్ విద్యార్థుల స్వర్ణోత్సవ వేడుకలు

పూర్వ విద్యార్థులు--విద్యాసంస్థలు--పరిశ్రమల భాగస్వామ్యంపై జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు

ముఖ్య అతిథిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. గౌరవ అతిథిగా ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం, నవంబర్ 21 (ప్రజాజ్యోతి):

కొత్తగూడెంలో మైనింగ్ విద్య ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఓయూ--కేయూ మైనింగ్ ఇంజినీర్ల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శనివారం జాతీయ స్థాయి సాంకేతిక సదస్సు నిర్వహించనున్నారు. మైనింగ్ ఇంజినీర్ల అసోసియేషన్ ఆఫ్ ఇండియా సింగరేణి విభాగం సహకారంతో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు 'పూర్వ విద్యార్థులు--విద్యాసంస్థలు--పరిశ్రమల భాగస్వామ్యం' అనే అంశాన్ని ప్రధాన ఇతివృత్తంగా ఎంపిక చేశారు. పూర్వ విద్యార్థులు, విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య పరస్పర సంబంధాలను బలోపేతం చేయడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశం. విద్యార్థులు, అధ్యాపకులు, పరిశ్రమల ప్రతినిధులు ఒకే వేదికపై తమ అనుభవాలు, పరిజ్ఞానాన్ని పంచుకోవడంతో పాటు పరస్పర సహకార అవకాశాలను అన్వేషించనున్నారు. విద్యాసంస్థల్లో అందించే విద్యకు, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడం, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం వంటి అంశాలపై చర్చించనున్నారు. సదస్సు ప్రారంభోత్సవానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గౌరవ అతిథిగా పాల్గొననున్నారు. కొత్తగూడెంలోని విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. జగన్మోహన్ రాజు



కార్యక్రమానికి అధ్యక్షత వహించనున్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్‌లో గతంలో సేవలందించిన విశ్రాంత అధ్యాపకులను ముఖ్య అతిథి సత్కరించనున్నారు. ప్రారంభోత్సవం, ముగింపు కార్యక్రమాలతో పాటు రెండు సాంకేతిక సమావేశాలు నిర్వహించనున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి డాక్టర్ ఎన్. రామచంద్రం ప్రధానాంశంపై కీలకోపన్యాసం చేయనున్నారు. అభివృద్ధిలో కీలక మూలకాలు, ఖనిజాలు, వాటి వినియోగాలపై జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హరి సర్వోత్తమన్, కృత్రిమ మేధస్సు యుగానికి అనుగుణంగా మైనింగ్ ఇంజినీర్లను సిద్ధం చేయడం, విశ్వవిద్యాలయ విద్యలో మార్పులపై ఆస్ట్రేలియాకు చెందిన ఎల్ఏఆర్ఏ ఎనర్జీ సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ లక్ష్మీనారాయణ చికటమర్ల, గనుల భద్రత, కార్మిక సంక్షేమానికి సంబంధించిన 2020 చట్టం, 2026 కేంద్ర నిబంధనల్లోని ముఖ్యాంశాలపై గనుల భద్రతా సంచాలకుడు డాక్టర్ ఇనుముల సత్యనారాయణ ఉపన్యాసాలు ఇవ్వనున్నారు. సాంకేతిక సమావేశాల అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు కొత్తగూడెంలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ పాత భవనంలోని బహిరంగ రంగస్థలంలో మైనింగ్ విద్య స్వర్ణోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. 1976 నుంచి 2026 వరకు వివిధ బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థులు, మాజీ అధ్యాపకులు, ప్రస్తుత విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొననున్నారు. ఇదే సందర్భంగా కొత్తగూడెం స్కూల్ ఆఫ్ మైన్స్ కళాశాలలో మైనింగ్ ఇంజినీర్ల అసోసియేషన్ ఆఫ్ ఇండియా విద్యార్థి విభాగాన్ని ప్రారంభించనున్నారు. ఈ విభాగం ద్వారా విద్యార్థులకు పరిశ్రమలతో ప్రత్యక్ష సంబంధాలు, సాంకేతిక ఉపన్యాసాలు, వృత్తిపరమైన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలు కలగనున్నాయి. ఈ సదస్సు ద్వారా పూర్వ విద్యార్థులు, విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య సమన్వయం మరింత బలోపేతం అవుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముద్రణ, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు విస్తృత ప్రచారం కల్పించి సహకరించాలని పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి కరుణ కుమార్ కోరారు.

జడ్పీ హైస్కూల్ స్థలంలో కమ్యూనిటీ హాల్ పేరుతో అడుగుపెడితే సహించేది లేదు

పాఠశాల పరిరక్షణకు కోసం రౌండ్ టేబుల్ సమావేశం లో పూర్వ విద్యార్థులు

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 21,(ప్రజా జ్యోతి)

పాల్వంచ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్థల పరిరక్షణకు పూర్వ విద్యార్థులు నడుం బిగించారు. పాఠశాల ఆవరణలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వరాదని, పాఠశాల స్థలాన్ని ఇంచు కూడా వదులుకునేది లేదని పూర్వ విద్యార్థులందరూ స్పష్టం చేశారు. శనివారం పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు రంగారావు విగ్రహం వద్ద పూర్వ విద్యార్థులు నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 1963 నుంచి నేటి వరకు వేలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి, డాక్టర్లు, ఇంజనీర్లు, రాజకీయ నాయకులు, వివిధ రంగాల్లో ప్రముఖులుగా ఎదిగేందుకు ఈ పాఠశాల పునాదిగా నిలిచిందన్నారు. అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ పాఠశాలను సందర్శించడం దీని ప్రత్యేకతకు నిదర్శనమన్నారు. ప్రస్తుతం కూడా అధిక సంఖ్యలో విద్యార్థులతో, మెరుగైన ఉత్తీర్ణత శాతంతో పాఠశాల కొనసాగుతోందని తెలిపారు.ఒకప్పుడు 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పాఠశాల స్థలం ప్రస్తుతం ఐదు ఎకరాలకు పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన స్థలాన్ని పాఠశాల అభివృద్ధికి మాత్రమే ఉపయోగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పాఠశాలకు తక్షణమే వాచ్‌మెన్‌ను నియమించాలని కోరారు. అనంతరం ఈ సమావేశంలో చేసిన తీర్మానాలను సోమవారం జిల్లా కలెక్టర్‌తో పాటు విద్యాశాఖ ఉన్నతాధికారులకు, జిల్లా మంత్రులకు, స్థానిక ఎమ్మెల్యే కు వినతి పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. పూర్వ విద్యార్థి కొండపల్లి శ్రీధర్ అధ్యక్షులు జరిగిన ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులు.. పట్టణ ప్రముఖులు కిలారు నాగేశ్వరరావు, కనగాల బాలకృష్ణ, ఎస్.జె.కె. అహ్మద్, కాల్వ భాస్కర్, బండి వెంకటేశ్వర్లు, ముత్యాల రమణమూర్తి, కనగాల అనంత రాములు, వడ్లమూడి పూర్ణచంద్రరావు, నల్లమల వేణు, దాసరి నాగేశ్వరరావు, ఎం.డి. మంజూరు, ఎం.డి. మసూద్, స్టాలిన్, అమీరుద్దీన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసిన ప్రజా కవి జయరాజు

ఇల్లందు, నవంబర్ 21 (ప్రజా జ్యోతి)

తెలంగాణ ఉద్యమంలో తన పాటలతో ప్రజలను ఉత్తేజపరిచి ప్రత్యేక తెలంగాణ ఆకాంక్షకు తన వంతు సహకారం అందించిన ప్రజాకవి, ఉద్యమకారుడు జయరాజు శనివారం ఇల్లందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎమ్మెల్యే కోరం కనుకయ్యకు చిత్రపటాన్ని బహుకరించి శాలువాతో ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పాడ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, నాయకులు పులి సైదులు, శివయ్య, మూతి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నల్ల మాస కృష్ణకు పలువురి పరామర్శలు

ఇల్లందు, నవంబర్ 21 (ప్రజా జ్యోతి)

ప్రముఖ న్యాయవాది, ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి డా. నలమాస కృష్ణ గౌడ్ తల్లి లక్ష్మి గత కొన్ని రోజుల క్రితం మృతిచెందగా శనివారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ వారు స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. అనంతరం లక్ష్మీ చిత్రపటానికి పూలమాలలు వేసి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంఘాల జేఏసీ కన్వీనర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్, పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.



ప్రేమించి పెళ్లికి నిరాకరణ.. యువతి ఆత్మహత్య - ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో నలుగురి అరెస్ట్

బూర్గంపహాడ్, నవంబర్ 21 (ప్రజా జ్యోతి):

ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి, అనంతరం వివాహానికి నిరాకరించడంతో మనస్తాపానికి గురైన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.వివరాల్లోకి వెళితే.. బూర్గంపహాడ్ మండలం చెరువు సింగారం గ్రామానికి చెందిన చరప కవిత (20) అదే గ్రామానికి చెందిన సున్నం చరణ్‌ను ప్రేమించింది. కాగా చరణ్ పెళ్లికి నిరాకరించడంతో తీవ్ర మనసాపానికి గురైన కవిత,అవమానభారాన్ని తట్టుకోలేక క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా,చికిత్స పొందుతూ మృతి చెందింది.ఈ ఘటనపై మృతురాలి తండ్రి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సున్నం చరణ్‌తో పాటు అతని కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదు చేశారు.కేసు దర్యాప్తులో భాగంగా శనివారం ప్రధాన నిందితుడు సున్నం చరణ్‌తో పాటు అతనికి సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొం టున్న తల్లిదండ్రులు లక్ష్మయ్య, జ్ఞానమణి,అన్నయ్య అరుణ్‌లను ఎస్సై ప్రసాద్ అరెస్టు చేశారు.అనంతరం నలుగురిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి దక్కడం హర్షణీయం

-డీసీసీ ఉపాధ్యక్షుడు గొడిశాల రామనాథం.

పినపాక,నవంబర్ 21(ప్రజాజ్యోతి)



బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా పినపాక మండలానికి చెందిన తోలెం కళ్యాణిని నియమించడం పట్ల పినపాక మండల ప్రజల తరఫున హర్షం వ్యక్తం చేస్తున్నామని డీసీసీ ఉపాధ్యక్షుడు గొడిశాల రామనాథం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పినపాక మండలానికి చెందిన మహిళకు బూర్గంపాడు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించడం అభినంద నీయ మన్నారు. ఈ నియామకంతో పినపాక మండలానికి సముచిత గుర్తింపు లభిం చిందని తెలిపారు. తోలెం కళ్యాణికి ఈ పదవి కల్పించిన పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నియామకం పట్ల మండల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ ద్వారా రైతుల సమస్యల పరిష్కారానికి, వ్యవసాయ రంగ అభివృద్ధికి తోలెం కళ్యాణి కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆమె తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ మండలానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

తిరుమల వలే భద్రాద్రిలో వసతులు కల్పించాలి

అమలకు ఉమ్మడి ఖమ్మం జిల్లా ముగ్గురు మంత్రులు దృష్టి సారించాలి.

భద్రాద్రి అభివృద్ధికి రూ. 400 కోట్లు కేటాయించిన ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు

టిఆర్ఎస్వి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డా "బూసిరెడ్డి శంకర్ రెడ్డి



భద్రాచలం, నవంబర్ 21 (ప్రజా జ్యోతి) :

తిరుమలలో భక్తులకు వసతి గదులు, క్యూ లైన్లలో కూర్చునేందుకు బల్లలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల ప్రసారానికి టీవీలు, పాలు, బిస్కెట్లు, ప్రసాదం పంపిణీ, మరుగుదొడ్లు, నిరంతర పారిశుద్ధ్య నిర్వహణ వంటి సౌకర్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. భద్రాచలంలోనూ ఇదే తరహా సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రామాలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఒప్పించి రూ.400 కోట్లు కేటాయించేలా కృషి చేయడం అభినందనీయమన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సమన్వయంతో పనిచేసి ఆలయ అభివృద్ధికి మరో రూ.2 వేల కోట్లు కేటాయించేలా కృషి చేయాలని కోరారు. భద్రాచలానికి వచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని వసతి సముదాయాలు నిర్మించాలని, స్థానిక ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసి పట్టణ, ఆలయ అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయాలన్నారు. బ్రిడ్జి పాయింట్ వద్ద అలిపిరిని తలపించేలా స్వాగత ద్వారం నిర్మించాలని, పట్టణమంతా శ్రీరామ నామస్మరణ, భక్తి గీతాలు మారుమోగేలా ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొం దించాలని సూచించారు. రాబోయే గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు అవసరమైన వసతి, ఇతర సౌకర్యాలు సిద్ధం చేయాలని కోరారు. ప్రభుత్వానికి నిధుల కొరత ఉంటే ప్రైవేటు వ్యక్తులను ప్రోత్సహించి వసతి సముదాయాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. 1/70 చట్టాన్ని అడ్డుగా చూపుతూ అభివృద్ధి పనులను నిలిపివేయకుండా, నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలకు ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి అభివృద్ధిని కాంక్షించే ప్రజలు, పాత్రికేయులు, కుల సంఘాలు, రాజకీయ పార్టీలు నిర్మాణాత్మకంగా సహకరించాలని, అభివృద్ధికి ఆటంకం కలిగించే ధోరణి విడనాడాలని డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి కోరారు.

ఓబీసీల జనగణన చేయడంలో జాప్యమెందుకు

-రాజకీయ లబ్ధి కోసమే బీసీ గణన ఆలస్యం

-కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా డిసెంబర్ 14,15న ఢిల్లీలో బీసీల జనభేరి: బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్

ఇల్లెందు, నవంబర్ 21 (ప్రజా జ్యోతి)



ఓబీసీల జనగణన చేయడంలో జాప్యమెందుకు అవుతుందని, కేంద్రాల్లో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసమే బీసీ గణన ఆలస్యం చేయడం జరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని ఏక్తా హౌస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న జన గణన ప్రశ్నావళిలో ఓబిసి కాలం చేర్చాలని, ఓబీసీల జనగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా డిసెంబర్ 14న ఢిల్లీలో బీసీల జనభేరి నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 60 శాతం బీసీలు ఉన్నప్పటికీ రాజకీయ, విద్య, ఉద్యోగ రిజర్వేషన్లలో బీసీలకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. బీసీ కులగన చేస్తామని కేంద్రీలోని బిజెపి ప్రభుత్వం చెప్పి మాట మార్చిందని తెలిపారు. దశాబ్దాలుగా బీసీ కులాల లెక్కలు తీయాలని దేశవ్యాప్తంగా ఉద్యమిస్తున్న సమయంలో 2025 ఏప్రిల్ 1న ఢిల్లీలో ప్రధానమంత్రి అధ్యక్షతన జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో బీసీ కులగనున చేపడతామని నిర్ణయం తీసుకున్నట్లు గుర్తు చేశారు. బీసీ కులగనున చేస్తామన్న ప్రధాని మాటలు నీటి మీద రాతలు గాని మిగిలిపోయాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలను లెక్కించిన మాదిరిగానే డ్రాప్ డౌన్ పద్ధతిలో ఓబీసీ కులాలను లెక్కిస్తే ఖచ్చితమైన లెక్కలు శాస్త్రీయ పద్ధతిలో వస్తాయని పేర్కొన్నారు. బీసీ కులాల లెక్కలు లేకపోతే బీసీల అస్తిత్వమే లేదని, బీసీలకు సామాజిక న్యాయం ఇంకా వెయ్యి ఏళ్ళు అయిన దక్కదని ఆవేదన వ్యక్తం చేశారు. మనదేశంలో ఎస్సీ, ఎస్టి, అగ్రవర్ణాలకు వారి జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగబద్ధంగా అన్ని రంగాలలో వారికి వాటా దక్కుతుంటే, బీసీలకు మాత్రం జనాభా 50 శాతానికి పైగా ఉన్నప్పటికీ రిజర్వేషన్లు మాత్రం సగంబాట దక్కడం లేదన్నారు. స్వాతంత్రం వచ్చి 79 ఏళ్లు అయినా బీసీలు యాచించే స్థాయిలోనే ఉండాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో బీసీలకు రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన వాటా దక్కకపోగా అగ్రవర్ణాల రిజర్వేషన్లతో బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందని తెలిపారు. 15 సంవత్సరాల తరువాత రూ 11,735 వేల కోట్ల ప్రజాధనంతో లెక్కిస్తున్న జన గణనలో ఓబీసీలను లెక్కించి తగు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఓబిసి అని చెప్పుకుంటున్న ప్రధానమంత్రి జన గణనలో ఓబీసీలను చేర్చకపోవడం భాజపా నిరంకుషత్వ వైఖరికి నిదర్శనమన్నారు. దేశ జనాభాలో మెజార్టీ గల బీసీలకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయానికి వచ్చే ఎన్నికల్లో బీసీలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఎన్డీఏ కూటమి బీసీల వ్యతిరేక కూటమిగా మారిందని, ఇండియా కూటమి సానుకూలంగా ఉన్నప్పటికీ ప్రకటనలకు, లేఖలకు మీటింగ్ లకు పరిమితమైందే తప్ప విజయం సాధించే ఉద్యమాన్ని ఆలోచించడం లేదని పేర్కొన్నారు. డిసెంబర్ 14న నిర్వహించతలపెట్టిన బీసీ జనభేరి సభకు ముందే కేంద్ర ప్రభుత్వం స్పందించి ఓబీసీ జనగణన చేపట్టాలని లేదంటే బీసీల ఆగ్రహానికి కేంద్ర ప్రభుత్వం ఆవిరైపోతుందని, వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం ఓటర్లు చెబుతారని హెచ్చరించారు. అనంతరం హలో బిసి... చలో ఢిల్లీ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ సంఘాల జేఏసీ కన్వీనర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్, 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్య, బీసీ సంఘ నేతలు దండ రాంచందర్, బంధం నాగయ్య, యం రమేష్, బిసి నేతలు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలస్థాయి చెకుముకి సంబురాలు – టాలెంట్ టెస్ట్ నిర్వహణ

-మండలంలో ఏడు పాఠశాల ల విద్యార్థులు పాల్గొన్నారు -ప్రభుత్వ పాఠశాల విభాగంలో ప్రథమ బహుమతి ఏ హెచ్ ఎస్ రేగళ్ల తండా

-ప్రైవేట్ పాఠశాల విభాగంలో ప్రథమ బహుమతి సెయింట్ విన్సెంట్ ఎదురుగడ్డ



లక్ష్మీదేవిపల్లి, నవంబర్ 21, ప్రజా జ్యోతి:

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సంబురాల్లో భాగంగా ఈరోజు లక్ష్మీదేవిపల్లి మండలస్థాయి టాలెంట్ టెస్ట్‌ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లక్ష్మీదేవిపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి పి. కృష్ణయ్య ప్రారంభించారు.ముగింపు కార్యక్రమంలో మండల విద్యాధికారి పి. కృష్ణయ్య మాట్లాడుతూ, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని, సైన్స్‌ను నమ్ముతూ మూఢనమ్మకాలను విడనాడాలని పిలుపునిచ్చారు. నిత్యజీవితంలో విజ్ఞానశాస్త్రం ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రశ్నించే తత్వం, పరిశీలన, తార్కిక ఆలోచనలతో విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో మండలంలోని ఏడు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రైవేట్ పాఠశాలల విభాగంలో సెయింట్ విన్సెంట్ పాఠశాల, ఎదురుగడ్డ ప్రథమ బహుమతిని సాధించగా, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఘనా రేగళ్లతండా ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది.మండలస్థాయిలో ప్రథమ స్థానాలు సాధించిన ఈ రెండు పాఠశాలల విద్యార్థులు ఈ నెల 28న నిర్వహించనున్న జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొననున్నారు.

సవాలును స్వీకరించారు సురక్షిత ప్రసవం చేశారు

పెద్దాసుపత్రులకు దీటుగా.. పాల్వంచ సి హెచ్ సి లోనే విజయవంతమైన హైరిస్క్ ప్రసవం! తల్లీబిడ్డ క్షేమం.-వైద్యులను అభినందించిన డిసిహెచ్ఎస్ అధికారులు

కొత్తగూడెం కలెక్టరేట్ ,నవంబర్ 21,(ప్రజా జ్యోతి)



కొత్తగూడెం జిల్లా పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యులు సమయస్ఫూర్తి, వైద్య నైపుణ్యంతో అరుదైన వైద్య విజయాన్ని సాధించారు. పలు ఆరోగ్య సమస్యలతో కూడిన హైరిస్క్ గర్భిణికి అత్యవసర సిజేరియన్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి తల్లీబిడ్డ ఇద్దరినీ క్షేమంగా కాపాడారు.

వివరాల్లోకి వెళ్తే.. పాల్వంచ మండలానికి చెందిన 25 ఏళ్ల శిరీష మొదటి కాన్పు కోసం పాల్వంచ సిహెచ్ సి కి వచ్చింది. అయితే ఆమెకు థైరాయిడ్ సమస్య, గర్భధారణ సమయంలో రక్తపోటు పెరగడం, రక్తంలో చక్కెర స్థాయిలు అధికంగా ఉండటం వంటి సమస్యలతో పాటు 115 కిలోల అధిక శరీర బరువు కూడా ఉంది. అంతేకాకుండా కడుపులోని శిశువు కూడా అధిక బరువుతో ఉండటంతో వైద్యులు ఈ కేసును హైరిస్క్‌గా గుర్తించారు.

సాధారణంగా ఇలాంటి క్లిష్టమైన కేసులను మెరుగైన వైద్య సదుపాయాలున్న పెద్ద ఆసుపత్రులకు తరలిస్తుంటారు. అయితే ఈ కేసును పాల్వంచ సిహెచ్ సి లోనే నిర్వహించేందుకు ప్రసూతి వైద్యురాలు డాక్టర్ ఎస్. లీనా, మత్తు వైద్యులు డాక్టర్ పి. రాంప్రసాద్ ప్రత్యేక చొరవ చూపారు. కేసులోని ప్రమాదాలను అంచనా వేసి, పరస్పర సమన్వయంతో బాధ్యతగా ముంద డుగు వేసి ఈ సవాలును స్వీక రించారు. అవసరమైన వైద్య ఏర్పాట్లతో తమ వైద్య బృందంతో కలిసి విజయ వంతంగా అత్యవసర సిజేరియన్ శస్త్రచికిత్స నిర్వహించారు.వారి సమయస్ఫూర్తి, వైద్య నైపుణ్యం, సమన్వయంతో 3.25 కిలోల బరువున్న ఆడ శిశువు సురక్షితంగా జన్మించింది. ప్రస్తుతం తల్లీబిడ్డ ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు.

సాధారణంగా ఉన్నతస్థాయి ఆసుపత్రులకు పంపించే ఇలాంటి క్లిష్టమైన కేసును స్థానిక సిహెచ్ సి లోనే స్వీకరించి, విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించిన ప్రసూతి వైద్యురాలు డాక్టర్ ఎస్. లీనా, మత్తు వైద్యుడు డాక్టర్ పి. రాంప్రసాద్‌తో పాటు మొత్తం వైద్య బృందాన్ని జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయ అధికారి డాక్టర్ రవి బాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ముక్కంటేశ్వరావు ప్రత్యేకంగా అభినందించారు.పెద్దాసుపత్రులకు దీటుగా ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వంటి చిన్న ఆసుపత్రులలో సైతం నాణ్యమైన ప్రసూతి వైద్యం, అత్యవసర శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ప్రభుత్వ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి అంటే మాకు ఎంతో నమ్మకం ..



అందుకే ఇక్కడ ప్రసవం– కుటుంబ సభ్యులు

మా కుటుంబం లో చాలా మంది పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవం జరిగిందనీ, కోవిడ్ సమయంలో సైతం ఇక్కడే మా కుటుంబ సభ్యుల కు కాన్పు సురక్షితంగా చేశారని. అందుకే రక్తపోటు , మధుమేహం , అధిక బరువు, మొదలగు సమస్యలు ఉన్న కూడా నమ్మకం తో వచ్చామని, మా నమ్మకాన్ని వమ్ము కాకుండా వైద్యులు సురక్షిత ప్రసవం చేశారని భర్త శశి కాంత్ తెలిపారు. 20 ఏళ్ల క్రితం తను కూడా ఇక్కడే ప్రసవం చేపించుకున్నానని, ఇప్పుడు తన కూతురు సైతం పాల్వంచ ఆసుపత్రిలో ప్రసవం జరగడం ఆనందంగా ఉందని,ఆసుపత్రి వైద్యులకి, సిబ్బందికి మా కుటుంబం రుణపడి ఉంటామని శిరీష తల్లి భాగ్యమ్మ తెలిపారు.

పదవ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

-ఏడూళ్ళ బయ్యారం పాఠశాలలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక.. సాయంత్రం ప్రత్యేక తరగతులు

- ఎంఈఓ కోరం నాగయ్య

పినపాక,నవంబర్ 21 (ప్రజాజ్యోతి):



పదవ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి 100 శాతం ఉత్తీర్ణత నమోదు చేయడమే లక్ష్యంగా ఏడూళ్ళ బయ్యారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు శనివారం పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.

విద్యార్థుల ప్రగతిపై సమీక్ష

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొమరం నాగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షలు, వాటి ఫలితాలు, ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిపై సమగ్రంగా సమీక్షించారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు కేవలం 100 రోజులు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు చేపట్టాల్సిన చర్యలపై తల్లిదండ్రులకు వివరించారు.

సాయంత్రం 5:30 నుంచి ప్రత్యేక తరగతులు

విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంపొందించడంతో పాటు, పరీక్షలకు మరింత సమర్థవంతంగా సన్నద్ధం చేసేందుకు పాఠశాల పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. తల్లిదండ్రుల పూర్తి అంగీకారంతో సాయంత్రం 5:30 గంటల నుంచి రాత్రి 8:30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు సమావేశంలో తీర్మానించారు.

సమిష్టి కృషితో ఉత్తమ ఫలితాల సాధన

ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థులకు అదనపు అభ్యసన సమయం కల్పించి, పాఠ్యాంశాలపై సందేహాలను నివృత్తి చేస్తూ పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయనున్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థుల సమిష్టి సహకారంతో ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడమే ప్రధాన లక్ష్యమని ప్రధానోపాధ్యాయుడు కొమరం నాగయ్య తెలిపారు. పాఠశాల యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయానికి విద్యార్థుల తల్లిదండ్రులు సంపూర్ణ మద్దతు తెలిపారు. సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పీచు మిఠాయి "బండి "తోనే రాజమౌళి జీవిత "బండి"

పీచు మిఠాయి వ్యాపారం తోనే రాజమౌళి జీవితం

50 ఏళ్లుగా ఇదే వ్యాపారం

వేసవి కాలంలో ఐస్క్రీమ్ వ్యాపారం

ఆరు పదులు దాటిన రాజమౌళికి అందని పింఛన్‌బిబి

నెరవేరనీ సొంత ఇంటి కల

నేటికీ అద్దె ఇంట్లోనే జీవితంబిబి ఇలాంటి వారికి ఇందిరమ్మ గృహాలు రావా??

కూతురు వివాహానికి కొనసాగిస్తున్న పీచు మిఠాయి వ్యాపారం

శాసన సభ్యులైన ఈ కష్టజీవికి ఆసరా చూపించి ఆదుకోండి

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 21,(ప్రజా జ్యోతి)

పాల్వంచలో గత 50 సంవత్సరాలుగా పీచు మిఠాయి వ్యాపారం చేస్తూ జీవితాన్ని ముందుకు నెట్టుకొస్తున్న రాజమౌళి అంటే తెలియని వారెవరు ఉండరు, అనేక సంవత్సరాలుగా రాజమౌళి పాల్వంచ పట్టణంలోని పలు పాటశాలల వద్ద పీచు మిఠాయి వ్యాపారం తో పాటు , వేసవి కాలంలో చిన్న ఐస్ బండి నెట్టుకుంటూ వచ్చి చిన్న పిల్లలకు ఐస్ క్రీమ్ ను విక్రయించి తన జీవితాన్ని కొనసాగిస్తూ వస్తున్నాడు, రాజమౌళి పాల్వంచలోని అన్ని పాఠశాలల వద్ద అమ్మిన పీచు మిఠాయి ,ఐస్ క్రీమ్ కొనుక్కొని తిన్న ఆనాటి చిన్నారులు నేడు వివిధ హోదాలలో ఉండిపోయారు, రాజమౌళి పాఠశాల వద్ద పీచు మిఠాయి బండి అవపడకపోతే పిల్లలు పీచు మిఠాయి బండి కోసం ఆనాడు విద్యార్థులు ఎదురుచూసేవారు, ఈ చొప్పున రాజమౌళి అంటే పాల్వంచలో తెలియని వారెవరు ఉండరేమో అనిపిస్తుంది! ఇతని వద్ద పీచు మిఠాయి, ఐస్ క్రీమ్ విక్రయించిన ఆనాటి పూర్వ విద్యార్థులు నేడు వివిధ స్థాయిలో ఉన్నప్పటికీ రాజమౌళి మాత్రం నేటికీ అదే బండిపై ఉన్న గంటను మోగిస్తూ పీచు మిఠాయి వ్యాపారం చేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు, ఇప్పటికీ రాజమౌళి తన బండి పై తన పీచ మిఠాయి వ్యాపారం చేస్తుండగా గత అనేక సంవత్సరాల క్రితం రాజమౌళి దగ్గర పీచు మిఠాయి కొనుక్కొని తిన్న పూర్వ విద్యార్థులు కొంతమంది తన వద్దకు వచ్చి ఇంకా నువ్వు ఇదే వ్యాపారం చేస్తున్నావా అని అడుగుతుండడంతో రాజమౌళి నోటి నుండి ఎలాంటి సమాధానం చెప్పలేక కుమిలిపోయిన సంఘటనలు ఎన్నో ఉన్నాయంటూ రాజమౌళి తన బాధను ప్రజాజ్యోతికి వివరించాడు, తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని కూతురు ఎనిమిదో తరగతి చదువు తుందని, కుమారుడు ఇంటర్ చదువుతున్నారనీ తెలిపారు, తాను టిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న పదేళ్ల హయాంలో కానీ ప్రస్తుతం కాంగ్రెస్



ప్రభుత్వ హయాంలో అనేకమార్లు ఇళ్ల స్థలాల కోసం అదేవిధంగా తనకు 60 ఏళ్లు నిండగా పించన కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఏ ఒక్క సంక్షేమ పథకం తనకు వర్తింప చేయలేదని వాపోయాడు, తానే స్వయంగా ఇంట్లోనే పీచు మిఠాయిని తయారు చేసుకొని తన బండిపై ప్రజలకు విక్రయిస్తూ వచ్చిన కొద్ది సంపాదన తోటే పిల్లలను చదివించుకుంటూ, ఇంటి అద్దె కడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నానని తెలిపారు, ప్రభుత్వాలు ఐదు సంవత్సరాలకు ఒకసారి మారుతున్న క్రమంలో ఆయా ప్రభుత్వాలు పెట్టిన సంక్షేమ పథకాలు పథకాలకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ నేటి వరకు తనకు ఎలాంటి సంక్షేమ ఫలాలు ప్రభుత్వం నుండి అందలేదని తెలిపారు, ఇప్పటికైనా రాజమౌళి కష్టాన్ని గుర్తించి స్థానిక శాసన సభ్యులైన రాజమౌళికి పింఛన్ తో పాటు ఇందిరమ్మ గృహాన్ని మంజూరు చేయించి రాజమౌళి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని రాజమౌళి వేడుకున్నారు